క్లుప్తంగా

గురుకుల పాఠశాలకు ఐదుగురు విద్యార్థుల ఎంపిక



తోట్లవల్లూరు: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఎంఈఓ జి. వెంకటేశ్వరరావు తెలిపారు. మండలంలోని గురివిందపల్లి మండల పరిషత్ పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల విద్యాలయాలలో ఐదో తరగతిలో ప్రవేశానికి అర్హత సాధించారు. గురుకుల పాఠశాలల్లో ప్రవేశానికి అర్హత సాధించిన విద్యార్థులు దేవరపల్లి అక్షయ్, వల్లే సాయిదుర్గాప్రసాద్, వల్లే ఝాన్సీ, కర్రా కీర్తిప్రియ, వల్లే గీతాదీప్తిని ఎంఈఓ వెంకటేశ్వరరావు, ఎంఈఓ–2 సురేష్ అభినందించారు. విద్యార్థులను ప్రోత్సహించిన ఉపాధ్యాయులు మట్టా రాజేష్, జే ఉషారాణికి అభినందనలు తెలిపారు.

పోలీసుల కవాతు



తోట్లవల్లూరు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండలంలోని పలు గ్రామాల్లో కేంద్ర పోలీసులు మంగళవారం కవాతు నిర్వహించారు. మండలంలోని చాగంటిపాడు, ఆళ్లవారిపాలెం, పిల్లివానిలంక, భద్రిరాజుపాలెంలో సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్‌కు చెందిన పోలీసు బలగాలు ప్రధాన రహదారుల వెంట కవాతు నిర్వహించాయి. పమిడిముక్కల సీఐ ఎం. కిషోర్‌బాబు, ఎస్ఐ పి.విశ్వనాథ్, సీఐఎస్ఎఫ్ ఎస్ఐ ప్రవీణ్ పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్ల పరిశీలన



ముదినేపల్లి రూరల్: మండలంలోని ముదినేపల్లి, పెయ్యేరు గ్రామాల్లో పోలింగ్‌స్టేషన్లను నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కె.భాస్కర్ మంగళవారం పరిశీలించారు. స్థానిక జెడ్పీ హైస్కూల్, పెయ్యేరు ప్రాథమిక పాఠశాలలోని పోలింగ్ స్టేషన్లను ఎస్ఎల్ఎన్ కుమారితో కలిసి పరిశీలించారు.

463 మందికి వైద్య పరీక్షలు



కైకలూరు: స్థానిక సచివాలయం –2లో ఆరోగ్య సురక్ష శిబిరం మంగళవారం జరిగింది. వైద్యులు టి.సికింద్రమోహన్, కరిష్మాబేగం, అన్నపూర్ణ జనరల్, ఈఎన్‌టీ, షుగర్, బీపీ ఇతర సమస్యలపై పరీక్షలు నిర్వహించారు. 463 మంది వైద్య పరీక్షలను చేయించుకున్నారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను అందించారు. ఎంపీహెచ్ఈఓ జి.శ్రీనివాసరావు, ఎంపీహెచ్ఎస్ కె.తాతారావు, హెచ్‌వీ వి.లక్ష్మీకుమారి టీచర్లు పాల్గొన్నారు.

నేటి నుంచి గుడివాడలో ఎన్నికల ప్రచారం

గుడివాడ టౌన్: గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) ఎన్నికల ప్రచారాన్ని బుధవారం నుంచి ప్రారంభించనున్నారు. స్థానిక ఏలూరు రోడ్‌లోని ఒకటో వార్డు నుంచి ఈ ప్రచారం ప్రారంభమవుతుందని వైఎస్సార్ సీపీ నాయకులు తెలిపారు. తొలుత శ్రీ విజయ దుర్గ అమ్మ వారి దేవస్థానంలో ప్రత్యేక పూజల అనంతరం ఆయన ప్రచారాన్ని ప్రారంభిస్తారని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు, గుడివాడ, నందివాడ, గుడ్లవల్లేరు, గుడివాడ రూరల్ మండలాల పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు, ప్రజా ప్రతినిధులు ప్రచారంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

సంక్షేమ ప్రభుత్వానికి అండగా నిలవండి

ఎమ్మెల్యే డీఎన్నార్

కలిదిండి: వైఎస్సార్ సీపీ సంక్షేమ ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) పేర్కొన్నారు. గుడ్ మార్నింగ్ కలిదిండి కార్యక్రమాన్ని ఎమ్మెల్యే డీఎన్నార్ ఒకటో వార్డులో మంగళవారం ప్రారంభించారు. ముందుగా ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నాయకులతో కలసి పాల్గొని ప్రజలకు శుభోదయం పలుకుతూ క్షేత్ర స్థాయిలో ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యేకు అడుగడుగునా ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఎమ్మెల్యే డీఎన్నార్ మాట్లాడుతూ ప్రతి గ్రామం సుస్థిర అభివృద్ధి చెందేలా అన్ని మౌలిక వసతులు జగన్ కల్పించారని తెలిపారు. గుడ్ మార్నింగ్ కార్యక్రమంతో ప్రజల మధ్యకు వెళుతుంటే ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు తిరుమాని రమేష్, సర్పంచ్ మసీముక్కు మారుతి ప్రసన్న, ఏఎంసీ చైర్మన్ కొల్లాటి సత్యనారాయణ, ఎంపీటీసీ షఫాయితుల్లా, పీఏసీఎస్ అధ్యక్షుడు వడుపు రామారావు, ఏఎంసీ మాజీ చైర్మన్లు సీలపాల వెంకటేశ్వరరావు, అయినాల బ్రహ్మాజీ, మండల కో–ఆప్షన్ సభ్యులు హఫీజ్ పాల్గొన్నారు.



ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్, నాయకులు

పేదల పక్షపాతి సీఎం జగన్

ముదినేపల్లి రూరల్: నవరత్నాల పేరుతో సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షపాతిగా ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) కోడలు దూలం స్వాతి, ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు ఈడే వెంకటేశ్వరమ్మ అభివర్ణించారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా మండలంలోని కొరగుంటపాలెంలో రెండో రోజు మంగళవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జరగబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులుగా వైఎస్సార్ సీపీ తరపున పోటీ చేస్తున్న దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్), కారుమూరి సునీల్‌కుమార్‌యాదవ్‌కు ఫ్యాన్ గుర్తుపై ఓట్లువేసి భారీ మెజార్టీతో గెలిపించి జగనన్న ముఖ్యమంత్రి కావడానికి సహకరించాలని కోరారు. హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, వైస్ ఎంపీపీలు చొప్పర్ల సునీత, రాచూరి రాధా, చొప్పర్ల సునీత, సర్పంచ్ పేరే రామకృష్ణ, సొసైటీఅధ్యక్షుడు అచ్యుత రాంబాబు, నాయకులు మోత్రు ఏసుబాబు, కోమటి విష్ణువర్ధన్, రాచూరి కుమార్, దివి సతీష్, పేర్ని పృథ్వీ పాల్గొన్నారు.



కొరగుంటపాలెంలో ప్రచారం చేస్తున్న దూలం స్వాతి

స్వామి ఆశీస్సులు అందరిపై ఉండాలి

కలిదిండి: బాల సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దివ్యమైన ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలందరిపై ఉండాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) కోరారు. మండలంలోని సానారుద్రవరంలో బాల సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ధ్వజస్తంభం ప్రతిష్ట చేసి సంవత్సరం అయిన సందర్భంగా అఖండ అన్న సమారాధన మంగళవారం నిర్వహించారు. ఎమ్మెల్యే డీఎన్నార్ స్వామిని దర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు వడ్లాని పార్థసారథి, కొండంగి ఎత్తిపోతల అధ్యక్షుడు నున్న కృష్ణబాబు, ఏఎంసీ మాజీ చైర్మన్ పాము రవికుమార్, మండ నవీన్, స్థానిక నాయకులు విన్నకోట సోమేశ్వరరావు, మారుబోయిన పెద్దిరాజులు, వడికిన వెంకటేష్ పాల్గొన్నారు.



స్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

ముగిసిన నాంచారమ్మ జాతర

- చివరి రోజు కొనసాగిన భక్తుల రద్దీ
- ఆలయ ప్రవేశం చేసిన చిన్నఅమ్మవారు

కోడూరు: విశ్వనాథపల్లి అద్దంకి నాంచారమ్మ ప్రధాన జాతర మంగళవారంతో ముగిసింది. జాతరలో తొలిరోజు కొండవీటి వంశీయుల, అమ్మవారి పుట్టింటివారైన గుంటూరు, ప్రకాశం జిల్లాల భక్తులు పసుపు, కుంకుమ, సారెను సమర్పించారు. సోమవారం గుడి ప్రధాన జాతర జరగ్గా, రాత్రి వివిధ సుదూర ప్రాంతాలకు చెందిన భక్తులు ప్రత్యేక వాహనాల్లో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. డప్పువాయిద్యాల నడుమ ప్రభల ఊరేగింపు, యువకుల విన్యాసాలతో ఆకట్టుకున్నారు. మంగళవారం ఉదయం కూడా జాతరలో భక్తుల రద్దీ కొనసాగింది. చివరిరోజు కావడంతో చుట్టూ పక్కల గ్రామాలకు చెందిన భక్తులు నైవేద్యాలు సమర్పించేందుకు తరలివచ్చారు. ఈ నెల 11న నాంచారమ్మ చిన్నఅమ్మవారి గ్రామోత్సవం ప్రారంభం కాగా, జాతర కూడా పూర్తి కావడంతో చిన్నఅమ్మవారిని అధికారులు ఆలయ ప్రవేశం చేయించారు. ఆలయ ప్రవేశ సమయంలో యువకులు వీరతాళ్లు, ఖడ్గాలతో చేసిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ప్రధాన రహదారికి ఇరువైపులా ఏర్పాటు చేసిన చిరుదుకాణాల వద్ద భక్తుల కోలాహలం కనిపించింది. ఆలయ ఈఓ సీహెచ్.సుధాకర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



అమ్మవారి ఊరేగింపు వద్ద భక్తుల రద్దీ

హుండీ ఆదాయం రూ.8.21లక్షలు

కోడూరు: విశ్వనాథపల్లి అద్దంకి నాంచారమ్మ అమ్మవారి ప్రధాన జాతరోత్సరాల్లో భాగంగా హుండీ ద్వారా ఆలయానికి రూ.8.21 లక్షల ఆదాయం సమకూరినట్లు ఈఓ సీహెచ్.సుధాకర్ తెలిపారు. ఈ నెల 24,25 తేదీల్లో అమ్మవారి జాతరోత్సవాలు జరగ్గా, రెండు రోజులకు సంబంధించిన హుండీలను మంగళవారం లెక్కించారు. హుండీ ద్వారా రూ.8,21,759 ఆదాయం లభించినట్లు ఈఓ చెప్పారు. గత ఏడాది కంటే రూ.1,35,310 ఆదాయం అధికంగా లభించిట్లు ఈఓ చెప్పారు. టికెట్లు, విరాళాలు, వివిధ రకాల పాటలకు సంబంధించిన ఆదాయాన్ని బుధవారం లెక్కించనున్నట్లు తెలిపారు. దేవదాయ ఇన్‌స్పెక్టర్ కే శ్రీనివాసరావు పర్యవేక్షణలో లెక్కింపు నిర్వహించారు. సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిని పాటించాలి

కైకలూరు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ పాటించాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి (ఆర్వో) కె.భాస్కరరావు అన్నారు. నియోజకవర్గంలో పెదపాలపర్రు, ఆలపాడు సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద వాహనాలను మంగళవారం తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ సరైన పత్రాలు లేని నగదును సీజ్ చేస్తామన్నారు. వాహనాలలో భారీగా బహుమతులు తరలిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆలపాడు చెక్‌పోస్టు అధికారి, ఫిషరీష్ ఏడీ షేక్ చాన్‌బాషా, కానిస్టేబుల్ రమేష్ పాల్గొన్నారు.

కైకలూరులో..

కైకలూరు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రతిఒక్కరూ ఎన్నికల నియమావళిని పాటించాలని కైకలూరు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి (ఆర్వో) కె.భాస్కరరావు పేర్కొన్నారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ అభ్యర్థుల కాన్వాయ్‌కు 10 వాహనాలు మాత్రమే ఉండాలన్నారు. ఒక వాహనానికి ఒక జెండా మాత్రమే కట్టాలన్నారు. రిటర్నింగ్ అధికారి అనుమతి లేకుండా రోడ్ షోలు చేయకూడదన్నారు. ముఖ్యంగా బాణసంచా ఎట్టి పరిస్థితుల్లోనూ కాల్చకూడదన్నారు.



ఆలపాడు చెక్‌పోస్టు వద్ద వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఆర్వో భాస్కరరావు

పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

పెడన: మండల పరిధిలోని నందమూరు శ్రీవాసవి పాలిటెక్నిక్ కళాశాలలో 2024–పాలిసెట్ ప్రవేశ పరీక్షకు సంబంధించి ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌వీకే ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28వ తేదీ నుంచి ఈ శిక్షణ కళాశాలలో ఉదయం 9 గంటల నుంచి ప్రారంభమవుతుందన్నారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాసిన విద్యార్థులు ఆసక్తి ఉన్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 94407 30562, 93903 53504, 82474 27885 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

ఏప్రిల్‌లో అంబేడ్కర్ విగ్రహ పునఃప్రతిష్ట



సమావేశంలో తీర్మానం చేస్తున్న కార్యవర్గ సభ్యులు

మండవల్లి: మండవల్లిలో బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహ పునఃప్రతిష్ట కార్యక్రమం ఏప్రిల్‌లో నిర్వహించనున్నట్లు అంబేడ్కర్ అసోసియేషన్ మండవల్లి అధ్యక్షుడు కొరపాటి శాంతరాజు తెలిపారు. స్థానిక మార్కెట్ యార్డులో శాంతరాజు అధ్యక్షతన మంగళవారం జరిగిన కార్యవర్గ సమావేశంలో ఈ మేరకు తీర్మానించారు. శాంతరాజు మాట్లాడుతూ జాతీయ రహదారి విస్తరణలో విగ్రహాన్ని మరోచోటికి మార్చిడి చేయాల్సిన ఆవశ్యకత ఉండడంతో, రోడ్డుకు రెండో వైపు ఏప్రిల్‌లో అంబేడ్కర్ జయంతికి ముందుగానే, పునః ప్రతిష్ట చేయనున్నట్లు పేర్కొన్నారు. గౌరవాధ్యక్షుడు ఎల్ఎస్ భాస్కరరావు, చాబత్తిన విజయ్, మేడేపల్లి సైమన్, మెండా సురేష్, చిగురుపాటి ఐజక్, గోరింక గాంధీ పాల్గొన్నారు.

ముళ్లపొదలు తొలగించాలి

తోట్లవల్లూరు: కృష్ణాకరకట్ట వెంబడి ముళ్లపొదల తొలగింపునకు చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు శీలం ప్రకాశరావు అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై ఎంపీడీఓ సత్యనారాయణకు మంగళవారం ఆయన వినతిపత్రం అందజేశారు. విజయవాడ–అవనిగడ్డ మధ్య కృష్ణా కరకట్టపై ప్రజలు రాకపోకలు ఎక్కువగా సాగిస్తున్నారని, రోడ్డుకు ఇరువైపులా ముళ్లపొదలు దట్టంగా పెరగడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

గుడివాడటౌన్ : ఆర్టీసీ ప్రయాణికులు తమ సమస్యలను వివరించేందుకు ఆర్టీసీ అభివృద్ధికి సలహాలు, సూచనలు ఇచ్చేందుకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ డి. రాజేష్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 11.30 నుంచి 12.30 గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. డిపో మేనేజర్‌తో మాట్లాడదలచిన వారు 99592 25464లో సంప్రదించాలని ఆయన కోరారు.

అభ్యంతరకర వార్తలపై ఫిర్యాదు చేయవచ్చు

పామర్రు: సోషల్ మీడియాలో వస్తున్న అభ్యంతరకర వార్తలు, వదంతులపై ఫిర్యాదు చేసే హక్కు ప్రతిఒక్కరికీ ఉందని పామర్రు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి మంగళవారం తెలిపారు. సోషల్ మీడియాలో వదంతులువస్తే వారిపై కృష్ణాజిల్లా పోలీసులకు ఫిర్యాదు చేయాలని పేర్కొన్నారు. ఈ సమాచారాన్ని 94906 18782 నంబరుకు ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

ఎమ్మెల్యే డీఎన్నార్‌ను ఆశీర్వదించండి



గోపవరంలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్ సతీమణి వీరాకుమారి

కైకలూరు: నిత్యం ప్రజల బాగు కోసం పరితపిస్తున్న ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్)కు మరో పర్యాయం ఓట్లు వేసి గెలిపించాలని ఎమ్మెల్యే డీఎన్నార్ సతీమణి వీరాకుమారి కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం ఆమె గోపవరం గ్రామంలో ఇంటింటా ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అడవి కృష్ణ, గ్రామ సర్పంచ్ ఉలిసి వసంతకుమారి, నాయకులు ఉలిసి శ్యాంబాబు, ఉప్పలపాటి జయదేవ్, గెద్దాడ కోటేశ్వరరావు, ఆకునూరి వెంకటేశ్వరరావు, బండి జ్ఞానేషు పాల్గొన్నారు.

భారీ అన్నసమారాధన



పెదపాలపర్రులో విశేష అలంకరణలో స్వామి, అమ్మవార్లు



సింగరాయపాలెం అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు

ముదినేపల్లి రూరల్: మండలంలోని సింగరాయపాలెం శ్రీలక్ష్మీనృసింహస్వామి వార్షిక కల్యాణోత్సవాల ముగింపు సందర్భంగా మంగళవారం భారీ అన్నసమారాధన జరిగింది. తొలుత స్వామి, అమ్మవార్లకు పూజలు నిర్వహించి ఆలయ చైర్మన్ మీగడ నెలబాలుడు, కార్యనిర్వహణాధికారి శింగనపల్లి శ్రీనివాసరావు పాలకవర్గ సభ్యులు అన్నసమారాధన ప్రారంభించారు. వైభవంగా కల్యాణం మండలంలో పెదపాలపర్రు శ్రీగంగాభ్రమరాంబ సమేత శ్రీమల్లేశ్వరస్వామివార్ల కల్యాణం మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకుడు హనుమాన్‌పూజారీ ఆధ్వర్యంలో ఉప్పలపాటి రాధాకృష్ణ, రమాదేవి దంపతులు కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం గ్రామంలో రథోత్సవాన్ని నిర్వహించి అన్నసమారాధన కార్యక్రమాన్ని చేపట్టారు.

నారీశక్తి అవార్డు ప్రదానం



నారీశక్తి అవార్డును అందుకుంటున్న ప్రొఫెసర్ రాజామాణిక్యం

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నంకు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.రాజామాణిక్యంకు జీసీఎస్ వల్లూరి ఫౌండేషన్ నారీశక్తి–24 అవార్డు ప్రదానం చేసింది. ఈ నెల 24వ తేదీ ఆదివారం హైదరాబాద్ లోని రవీంద్రభారతిలో జరిగిన ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో రాజామాణిక్యంకు ఈ అవార్డును అందజేశారు. మచిలీపట్నం హిందూ కళాశాలలో అధ్యాపకురాలిగా సుదీర్ఘకాలం పనిచేసిన ఆమె ప్రస్తుతం విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు.

వలంటీర్లకు టీడీపీ నాయకులు క్షమాపణ చెప్పాలి



విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గుడివాడ టౌన్: ప్రభుత్వ సేవలు ప్రజలకు అందించడంలో భాగస్వాములైన వలంటీరు వ్యవస్థను టెర్రరిస్టులుగానూ, సంఘ విద్రోహ శక్తులుగానూ పోలుస్తూ టీడీపీ, జనసేన నాయకులు విమర్శించడం దుర్మార్గపు చర్య అని వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మండలి హనుమంతరావు, పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను అన్నారు. మంగళవారం స్థానిక వైఎస్సార్ సీపీ ఎన్నికల కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. దేశ వ్యాప్తంగా ఎక్కడా లేని విధంగా వలంటీరు వ్యవస్థ ప్రజలకు సేవలు చేస్తుందన్నారు. కరోనా విపత్తు సమయంలో ప్రపంచమంతా భయాందోళనలతో గురవుతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ మేరకు ధైర్యంగా ప్రజలకు సేవచేసిన వారు వలంటీర్లు అన్నారు. వైద్య సిబ్బందితో ఇంటింటికీ జ్వరం పరీక్షలు చేయడం, రేషన్ అందించడం, వైద్య పరీక్షలు చేయించి వారికి మందుల కిట్లు అందించడంలో వలంటీర్లు చూపిన చొరవ అభినందనీయమని పేర్కొన్నారు. అవ్వాతాతలకు పెన్షన్‌ల పంపిణీ నుంచి విద్యార్థులకు అవసరమైన సర్టిఫికెట్‌లు అందించడం తదితర సేవలు చేస్తున్న వలంటీర్లను ఇంత ఘోరంగా అవమానించడం దురదృష్టకరమన్నారు. వలంటీర్లు టెర్రరిస్టులని, ఉమెన్ ట్రాఫింగ్‌కు పాల్పడుతున్నారని ఇటువంటి దుర్మార్గపు ఆరోపణలు చేస్తున్న ఈ టీడీపీ, జనసేన నాయకులు తక్షణమే వారికి క్షమాపణ చెప్పాలన్నారు. ఆరోపణలు చేసేవారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని తాము ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తున్నామన్నారు. వలంటీర్లు చేస్తున్న సేవలకు టీడీపీ, జనసేన పార్టీలు భయపడుతున్నాయన్నారు. ఇప్పటికే ఓటమి భయం పట్టుకున్న ఈ నేతలు ఈ విధమైన దిగజారుడు ఆరోపణలకు పాల్పడుతున్నారని వలంటీర్ల ద్వారా సేవలు పొందుతున్న ప్రజలే వారికి బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ బీసీ సెల్ ఉపాధ్యక్షుడు నయనవరపు శేషుబాబు, ఎ.కృష్ణమోహన్ పాల్గొన్నారు.

దత్తపుత్రుడి కలలు నెరవేరవు

గుడివాడ టౌన్: చంద్రబాబు నాయుడు, సొంతపుత్రుడు, దత్తపుత్రుడు కంటున్న కలలు నెరవేరవని వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మండలి హనుమంతరావు అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నికలు జరిగిపోయినట్లు 175 స్థానాలు గెలిచి ప్రభుత్వం స్థాపించినట్లు ఈ సొంతపుత్రుడు, దత్తపుత్రుడు వీర ప్రగల్భాలు పలుకుతున్నారన్నారు. ఎర్ర పుస్తకం అంటూ పప్పు నాయుడు, అంతుచూస్తామంటూ దత్తపుత్రుడు రంకెలు వేస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులను, అధికారులను, పోలీసులను, వలంటీర్లపై హెచ్చరికలు జారీ చేస్తున్నారని పేర్కొన్నారు. 50 స్థానాల్లో పోటీ చేస్తానని ప్రగల్భాలు పలికిన దత్తపుత్రుడు 20 స్థానాలకు పడిపోవడం, తాను గెలుస్తాడో లేదో తెలియని అయోమయ స్థితిలో పనిచేస్తున్న పవన్ కల్యాణ్ ఏవిధంగా ప్రభుత్వాన్ని స్థాపిస్తాడో ప్రజలకు చెప్పాలన్నారు. ఇక మంగళగిరిలో పోటీచేస్తున్న పప్పు నాయుడు ఓటమి భయంతో, చంద్రబాబు నాయుడు పిచ్చి ప్రసంగాలు చేస్తున్నారని, వీరి ప్రకటనలను ఎన్నికల కమిషన్ సుమోటోగా తీసుకుని తగు చర్యలు తీసుకోవాలని కోరారు. వీరి ముగ్గురికి రాష్ట్ర ప్రజలు గట్టిగా బుద్ధి చెబుతారన్నారు.

వేసవిలో నీటి ఎద్దడి రాకుండా చర్యలు

ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ



కైకలూరు: వేసవిలో నీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ అధికారులను కోరారు. కైకలూరులో ఆయన మంగళవారం మాట్లాడుతూ అధికారులు నీటి సమస్య ఉత్పన్నమయ్యే గ్రామాలను ముందుగానే గుర్తించాలన్నారు. అవసరమైతే తాగునీటి ట్యాంకర్లను గ్రామాలకు సరఫరా చేయాలన్నారు. గ్రామాల్లో ప్రస్తుతం అందుబాటులో నీటిని ప్రజలు వృథా చేయకుండా అవగాహన కలిగించాలన్నారు. గ్రామపంచాయతీ సెక్రటరీలు కీలకపాత్ర పోషించాలని కోరారు. నిరుపయోగంగా ఉన్న బోర్లు, చేతి పంపులను మరమ్మతు చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.

ఘనంగా చెన్నకేశవస్వామి కల్యాణోత్సవం

పమిడిముక్కల: మండలంలోని తాడంకి శ్రీభూసమేత చెన్నకేశవస్వామి దేవస్థానంలో జెడ్పీటీసీ సభ్యురాలు యేనుగ వెంకటరమణకుమారి, మస్తాన్‌రావు దంపతుల ఆధ్వర్యంలో చెన్నకేశవస్వామి వార్షిక కల్యాణోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వైఎస్సార్ సీపీ మహిళా జిల్లా అధ్యక్షురాలు కైలే జ్ఞానమణి, ఎంపీపీ కాసాని వేద సుప్రజ, జెడ్పీటీసీ సభ్యురాలు రమణకుమారి, సర్పంచ్ జంపాన ధనలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు మేరుగ లక్ష్మి, జురువరపు శృతి, వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర కార్యదర్శి జంపాన పూర్ణిమ దంపతులు స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. రెండు వేల మంది భక్తులకు అన్నసంతర్పణ చేశారు. ఆలయ ఈఓ జన్ను వెంకటేశ్వరరావు, యేనుగ మస్తాన్‌రావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ శొంఠి వెంకటేశ్వరరావు, రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ కంభపు రాంబాబు, ఎంపీటీసీ సభ్యుడు వంశీ పాల్గొన్నారు.



తాడంకిలో స్వామిని దర్శించుకున్న కైలే జ్ఞానమణి, ప్రజాప్రతినిధులు